క్లుప్తంగా

కరాటే పోటీలలో డోన్ విద్యార్థుల ప్రతిభ



కరాటే విజేతలతో నిర్వాహకులు

డోన్: ఈనెల 3న కర్నూలులోని దేవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే పోటీలలో రామ్ స్కూల్ కరాటే ఆఫ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఏబీ అకాడమీ కర్నూలు వారు నిర్వహించిన మేయర్ కప్ పోటీలలోని కటా విభాగంలో అశ్వర్థరెడ్డి, రోహిత్, అక్షయ, సాకేత్, దేవాన్ష్, తరుణ్, బాలాజీ, అభిరాం, మోక్షిత్, ఆనంద్ రెడ్డి, స్వాతిరెడ్డిలు బంగారు పతకాలు, చక్రధర్, లాస్య, సిరిచందన, సాయిచరణ్‌లు సిల్వర్, అఫీష్, మోక్షజ్ఞ, చరణ్‌తేజ, రవళి, తన్విరెడ్డి, జ్ఞానేశ్వర్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కుమితి విభాగంలో దేవాన్ష్, తరుణ్ మోక్షిత్, ఆనంద్‌రెడ్డి, తన్విరెడ్డి గోల్డ్, సాయిచరణ్, స్వాతిరెడ్డి సిల్వర్, అభిరాం బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ రమణ తెలిపారు. విజేతలకు కర్నూలు మేయర్ బీవై రామయ్య బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కృష్ణవేణి

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన షేక్ ఇమాం ఉసేన్ అనారోగ్యంతో బాధపడుతూ కొన్ని రోజుల నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ కృష్ణవేణి పింఛన్ డబ్బు వైద్యఖర్చులకు ఉపయోగపడతాయని భావించి సోమవారం కర్నూలు ఆసుపత్రికి వెళ్లి అందజేసింది.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ చెన్నకేశవులు

డోన్ రూరల్: మండల పరిధిలోని చిన్న మల్కా పురం గ్రామంలో ఉన్న ప్రాథమిక వైద్యశాలల మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ చెన్నకేశవులు సోమ వారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు కర్నూలులో జాబ్ మేళా

డోన్ టౌన్: కర్నూలులోని సి.క్యాంప్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు అధికారి దీప్తి సోమవారం ఒక ప్రకటన తెలిపారు. అపోలో ఫార్మసీలో ఫార్మాసిస్ట్ కోసం ఎం.ఫార్మసీ, బీ.ఫార్మసీ, డి.ఫాం విత్ పీసీఐ పాస్ అయిన వారు, రిటైల్ ట్రైనీ అసోసియేట్ కోసం పదవ తరగతి లేదా అంతకు పైన చదివి 19 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు విద్యా అర్హతల ధ్రువపత్రాలు, పాస్‌ఫొటోలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే గ్రామాభివృద్ధి

డోన్ రూరల్: గత ప్రభుత్వం కంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉడుములపాడు గ్రామాభివృద్ధి జరిగిందని ఎంపీటీసీ సుమిత్రమ్మ అన్నారు. గ్రామంలో సోమవారం ఈఓఆర్‌డీ జయరాముడు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తున్న జగనన్నే మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు




సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటుతో వెలుగులీనుతున్న పరిసరాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో దేవదాయశాఖ, డీఎంఎఫ్ నిధులతో సెంట్రల్ లైటింగ్ పనులను సోమవారం పూర్తి చేశారు. సెంట్రల్ లైటింగ్ కాంతులతో యాగంటి క్షేత్రానికి కొత్తశోభ వచ్చిందన్న అభిప్రాయం భక్తులు వ్యక్తం చేస్తున్నారు.



బేతంచెర్ల ముచ్చట్ల మల్లికార్జున స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



యాగంటి క్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి గుహ వద్ద భక్తుల రద్దీ



యాగంటి క్షేత్రంలోని నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

కార్తీకం..కమనీయం

- యాగంటి క్షేత్రంలో భక్తుల సందడి



కొలిమిగుండ్లలో సామూహికంగా నోములు చేసుకుంటున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని పవిత్ర యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి కార్తీకమాస రెండవ సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులు శివ పార్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన సహస్రనామావళి, మహానివేదన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నుంచి గాక రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన భక్తులు క్షేత్రంలోని పెద్ద పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి, అక్కడే కార్తీక దీపాలు వెలిగించారు. మరికొందరు ఆలయ ప్రధాన గోపురం వద్ద, ఆలయ ఆవరణంలో కార్తీకదీపాలు వెలగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. బనగానపల్లె ఆర్టీసీ నుంచి యాగంటి క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీస్‌లు నడిపారు. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కిక్కిరిసిన శివాలయాలు

బేతంచెర్ల: మండలంలోని శివాలయాలు కార్తీక మాసం 3వ సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. శివునికి ప్రీతికరమైన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జునస్వామి, యంబాయి గ్రామంలోని రామలింగేశ్వరుడు, బైనపల్లె, ముసలాయిచెర్వు, రహిమానుపురం గ్రామాల్లో వెలిసిన కాశీవిశాలక్షి, విశ్వేరస్వామి, సిమెంట్ నగర్‌లో వెలసిన జీవ బుగ్గ లింగేశ్వరస్వామి, పట్టణంలోని పూదోట మఠంలో వెలసిన భేతేశ్వర శివలింగానికి, దుర్గాపేటలో వెలిసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఉదయం మహిళలు కార్తీక దీపాలు వెలిగించి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. ఆలయ ఆవరణంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. బుగ్గానిపల్లె తండా సమీపాన వెలసిన సర్వేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం శివుని అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. నందికోలసేవతో పాటు భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో గౌరీ నోములు

కొలిమిగుండ్ల: కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో గౌరీ నోములు నోముకున్నారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు సామూహికంగా నోములు చేసుకున్నారు. నోముల విశిష్టతతో పాటు కథను చదివి వినిపించారు. మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో భక్తుల రద్దీ ఏర్పడింది. తెల్లవారుజామునే శివనామస్మరణ మార్మోగింది. మహిళలు కార్తీక స్నానాలు చేసి దీపాలు వెలిగించారు.

అన్నాభిషేకం..

డోన్: కార్తీక మూడో సోమవారం పురస్కరించుకుని స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఉన్న సాంబ శివాలయంలో భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కళ్లే శేషావలిశర్మ ఆధ్వర్యంలో పురోహితులు శ్రీనివాసులు, గంగాధర శాస్త్రిలు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు.

పాతబుగ్గలో..

స్థానిక పాతబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో పురోహితులు రాజేష్, అనిల్ శర్మలు కార్తీక సోమవారం స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బైసాని రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

11న ఎడ్ల బండలాగుడు పోటీలు

బనగానపల్లె రూరల్: కార్తీక చివరి సోమవారం సందర్భంగా ఈ నెల 11న రాష్ట్ర, అంతర్రాష్ట్ర ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు పసుపల గ్రామ సమీపంలో వెలసిన గుండం మల్లికార్జునస్వామి దేవస్థానం ధర్మకర్త మండలి చైర్మన్ రాజేశ్వరప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 90008 41874, 974379613 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారన్నారు. అలాగే అదే రోజు ఆల య ఆవరణంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయనున్నామని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

6న రాష్ట్రస్థాయి గార్ధబాల పోటీలు

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల ఆకుమల్ల, ఆల్వకొండ క్రాస్ వద్ద వెలసిన కాశినాయన ఆశ్రమం ఆరాధన సందర్భంగా ఈనెల 6న రాష్ట్ర స్థాయి గార్ధబాల(గాడుదల), ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శంకర్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. విజేతల యజమానులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

కోవెలకుంట్లలో మోస్తరు వర్షం

కోవెలకుంట్ల: నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం తుఫాన్(మిచాంగ్) ప్రభావంతో సోమవారం రాత్రి స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో సబ్ డివిజన్‌లో విస్తారంగా పప్పుశనగ, కంది, మినుము, పెసర, తదితర పంటలు సాగు చేశారు. విత్తనం వేసినప్పటి నుంచి వర్షం కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో తుఫాన్ ఆశాజనకంగా మారటంతో రైతులు ఊరట చెందుతున్నారు.

క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న క్రీడల్లో ప్రతి క్రీడాకారుడు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ 51 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం సాగుతుందన్నారు. 15 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు ఉంటాయన్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కబడ్డీ, ఖోఖో విభాగాల్లో ఇష్టమైన విభాగాన్ని ఎంచుకుని పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 13 లోపు సచివాలయాల్లో ఆధార్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. క్రీడాకారులను ఉత్సాహ పరిచేందుకు తాను కూడా రిజిష్టర్ చేయించుకున్నానన్నారు. విజేతలకు నగదు బహుమతులు ఉంటాయన్నారు.

శ్రీరాముని సేవలో తరించండి



భజనలు, కీర్తనలు చేస్తున్న భక్తులు

డోన్ టౌన్: రామ కార్యం చేసే భాగ్యం త్రేతాయుగంలో అయోధ్య వాసులదైతే ప్రస్తుతం మన ద్రోణాచల మండలవాసులదని విశ్వ హిందూ పరిషత్ జన సంపర్క్ అభియాన్ మండల కార్యదర్శి రామారాజేష్ అన్నారు. నవంబరు 22న అయోధ్య నుంచి డోన్‌కు వచ్చిన అక్షింతలకు స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని 46 గ్రామాలకు అందజేయడానికి ప్రజల భాగస్వామ్యంతో అక్షింతల వృద్ధి, స్పర్శ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జన సంపర్క అభియాన్ సంబంధించి గ్రామాల్లో చేయవలసిన పనులు, అయోధ్య రామ మందిర నిర్మాణ చరిత్రను భజరంగదళ్ ప్రాంత సహ సంయోజక్ సందీప్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అభియాన్ ప్రముఖ్ కమ్మయ్య, ప్రఖండ ఉపాధ్యక్షులు శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి రామరాజేష్ పాల్గొన్నారు.

ఆవోపా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆవోపా సభ్యులు

డోన్ టౌన్: ఆవోపా -2024 క్యాలెండర్‌ను స్థానిక కార్యాలయంలో సోమవారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణకిషోర్, జొన్నలగడ్డ శ్రీనివాసుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆవోపా సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్య సేవలు చిరస్మరణీయం

బేతంచెర్ల: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం రోశయ్య సేవలు చిరస్మరణీయమని వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బళ్లాని, గుప్త, కోశాధికారి రమణ అన్నారు. సోమవారం అమ్మవారిశాలలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రోశయ్య వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కందగడ్డల మోహన్‌రావుతో పాటు పలువురు హాజరై పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

వ్యక్తి ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన కొత్తమిద్దె రామక్రిష్ణ (38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామాని చెందిన రామక్రిష్ణ రెండు రోజుల నుంచి కనపడడం లేదు. కుటుంబ సభ్యులు, బంధువులు వెతికినా ఆచూకీ లేదు. సోమవారం గ్రామ సమీపంలో ఉన్న బావి వద్ద రామక్రిష్ణ చెప్పులను గమనించిన గ్రామస్తులు.. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఆయిల్ ఇంజిన్లతో బావిలోని నీళ్లను బయటకు తోడి చూడగా మృతదేహం లభ్యమైంది. మృతినికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

మతిస్థిమితం లేని మహిళపై కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన మతిస్థిమితం హేమలతపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు. కాలనీవాసులు, కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తుండటంతో తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, డోన్ కోర్టులో హాజరు పరచినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న ఎంపీపీ నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: అర్హులదరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. సోమవారం గోరుమానుకొండ గ్రామంలో పల్లెకు పోదాం, ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలను దృష్టిలో పెట్టుకొని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిలను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఈఓఆర్డీ వెంకటరంగనాయక్ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రామనాథం తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



సంక్షేమ వివరాల బోర్డు ఆవిష్కరించిన ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: చేసిన మేలును గుర్తుంచుకొని మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలోని కొండమనాయునిపల్లె గ్రామసచివాలయ పరిధిలో ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగున్నర ఏళ్లలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందిన నగదు, గ్రామ అభివృద్ధికి చేసిన ఖర్చు వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్ ఎందుకు కావాలి అంశంపై ఎంపీపీ ప్రజలకు వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ రామకృష్ణవేణి, ఎంపీటీసీ సోమ్లా నాయక్, గ్రామపెద్దలు నారాయణ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి

ప్యాపిలి: సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలవుతున్నాయని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీ ఐబీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. స్థానిక రెండో సచివాలయం ఆవరణలో సోమవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి? అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరముందని వివరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ, గండికోట రామాంజనేయులు, కొండయ్య, సోమశేఖర్, మత్తుబాబా సాహెబ్, బోరెడ్డి రఘు, పర్వతం శ్రీను, సంజీవరెడ్డి, పాండు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్: జీఓ నంబరు 512 భూ హక్కు చట్టాన్ని ఉప సంహరించుకోవాలని డోన్ బార్ కౌన్సిల్ సభ్యులు కోరారు. స్థానిక కోర్టు ఆవరణంలో సోమవారం విధులు బహిష్కరించి నిరసనలు వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ అధ్యక్షులు రేగటి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు గతంలో కింది కోర్టులకు అవకాశం ఉండేదన్నారు. జీఓ నంబర్ 512తో కేవలం హైకోర్టుకే అధికారులు ఉన్నాయన్నారు. వీటిని రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 15 వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అక్కడి సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహులు, శేషశయనరావు, బద్దల వెంకటేష్, ఖాసీంసాహెబ్, రంగారెడ్డి, రాముడు, ప్రసాద్, విజయ్, కృష్ణప్రసాద్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



పెట్నికోటలో బాలికతో మాట్లాడుతున్న అధికారులు

కొలిమిగుండ్ల: బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సాయికృష్ణ, బనగానపల్లె మైనింగ్ ఏడీ రాజగోపాల్ సూచించారు. సోమవారం తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌తో కలిసి పెట్నికోట, కొలిమిగుండ్ల, బెలుం గ్రామాల్లో అధికారుల బృందం పర్యటించారు. మూడు గ్రామాల్లో బడి మధ్యలో వివిధ కారణాలతో చదువు మానేసిన 30 మంది బాల, బాలికలను గుర్తించారు. చదువుపై తల్లితండ్రులతో పాటు పిల్లలకు అవగాహన కల్పించారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

అవుకు: బాల, బాలికలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బనగానపల్లె అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభారాణి దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కిరాణం, ఫ్యాన్సీ స్టోర్స్, హోటల్స్, క్లాత్ స్టోర్స్ తదితర దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

శివవరంలో చోరీ

అవుకు: మండల పరిధిలోని శివవరం గ్రామంలో చోరీ జరిగినట్లు ఎస్ విష్ణునారాయణ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన రైతు పెరుమాళ్ల బిజయ్య వ్యవసాయ పెట్టుబడి కోసం రూ.40 వేలు తన ఇంటిలోని బీరువాలో దాచుకున్నాడు. ఇంటికి తలుపులు లేకపోవడంతో గత నెల 29న గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి నగదుతో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం

డోన్ టౌన్: లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని పూర్వ పిండ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం కమిటీ సభ్యులు డాక్టర్ చెన్నకేశవులు అన్నారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుష నిష్పత్తి సమానంగా ఉండాలే చూసుకోవాలన్నారు. సమావేశంలో ఏఓ శ్రీనివాసులు, డాక్టర్ గోపాల్, కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆవులను రహదారులపై వదిలితే చర్యలు

బేతంచెర్ల: పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో ఆవులను వదలొద్దని సీఐ ప్రియతం రెడ్డి యజమానులకు సూచించారు. కూడళ్లు, రహదారుల వెంట వదలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. యజమానులు ఆవులను ఇంటి వద్దకు తీసుకెళ్లాలన్నారు. మరోసారి రోడ్లు, వీధుల్లోకి విచ్చలవిడిగా వదిలితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు

అభివృద్ధి పనుల పరిశీలన



ధరణి టౌన్ షిప్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

బేతంచెర్ల: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి సోమవారం పరిశీలించారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వాటర్ గ్రిడ్ పనుల్లో భాగంగా మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామ సమీపాన 8 ఎకరాల్లో ఉన్న నీటి సంపులు, నీటి శుద్ధి కేంద్రం పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. అనంతరం పట్టణంలోని ధరణి టౌన్ షిప్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, కోటపేట కందకం, మార్కెట్ యార్డు, దుర్గాపేట కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కొత్తపల్లె గ్రామ సమీపాన పంప్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రి ఓఎస్డీ ప్రతాప్‌రెడ్డి, పీఏ శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బుగ్గన మన్‌మోహన్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, ఏఈ శేఖర్ బాబు పాల్గొన్నారు.

దంపతులకు గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య, భర్త గాయపడ్డారు. సోమవారం ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన సర్వేశ్వరరెడ్డి, తేజశ్విని దంపతులు ఓ శుభకార్యం నిమిత్తం రాంమూర్తినగర్‌కు బైక్‌పై బయలుదేరారు. జోళదరాశి సమీపంలో వీరిక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో భార్య, భర్త గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

బనగానపల్లె రూరల్: మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన బడిగి మద్దయ్య అతని భార్య పద్మావతితోపాటు మరో ఇద్దరిపై దౌర్జన్యం, దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన జంగిటి వరాలు, బడిగి మద్దయ్య ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. రెండిళ్ల మధ్య గోడను జంగిటి వరాలు తన సొంత డబ్బుతో నిర్మించింది. సగం డబ్బు చెల్లించాలని బడిగి మద్దయ్య, అతని భార్య పద్మావతిలను కోరడంతో ఆవేశానికిలోనైన దాడికి దిగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మద్దయ్య, పద్మావతితో పాటు దాయాదులు రమణమ్మ, పుల్లయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్‌ఐ తెలిపారు.